
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం ౹ 2 ౹ మార్చి ౹ 2025





పవిత్రమాసం.. రంజాన్

పవిత్రమైన రంజాన్ మాసం నేటి నుంచి ప్రారంభం కానుంది. శనివారం నెలవంక కనిపించగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 8లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం, రాత్రి మాత్రం కొంత చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, ఫిబ్రవరి నెలలో స్వామి వారిని 1,97,860 మంది దర్శించుకున్నారు.

రామయ్యకు భక్తుల విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో వివిధ కార్యక్రమాల నిమిత్తం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండయ్యపల్లికి చెందిన రెడ్ల కిషన్ – కల్పన దంపతులు రూ.2,00,232 విరాళాన్ని శనివారం అందజేశారు. ఆలయంలో జరిగే నిత్యాన్నదానానికి రూ.1,00,116, గోశాలలో ఏడాది పాటు ఆవుల పోషణకు రూ.1,00,116 వినియోగించాలని ఆలయ అధికారులను కోరారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకోగా, సిబ్బంది స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. ఆలయ పీఆర్వో సాయి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ) : అన్నపురెడ్డిపల్లిలో వేంచేసి ఉన్న శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయగా వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. వందల సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించి పులకించిపోయారు. కాగా, ఆలయ అధికారులకు భక్తులకు అన్నదానంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించారు.

యూడీఐడీ పోర్టల్‌పై అవగాహన కల్పించాలి



వీసీలో అదనపు కలెక్టర్, అధికారులు


చుంచుపల్లి: ప్రత్యేక వైకల్య గుర్తింపు (సదరం) కార్డు కోసం యూడీఐడీ(యూనిక్ డిజబిలిటీ ఐడీ) పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవగాహన కల్పించాలని సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్‌ఎంఓ రమేష్,సెర్ప్ సిబ్బంది యాదయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం కోసం మీసేవ, వీఎల్‌ఈ కేంద్రాలను ఆశ్రయించేవారని, ఇప్పుడు వీటితోపాటు యూడీఐడీ పోర్టల్, మొబైల్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియను శనివారం నుంచి అమల్లోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.

10లోపు ఇందిరమ్మ లబ్ధిదారులకు మొదటి బిల్లు

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు మొదలుపెట్టాలని గృహ నిర్మాణ శాఖ ఖమ్మం పీడీ బి.శ్రీనివాస్ సూచించారు. మండలంలోని కొంగరలో లబ్ధిదారులతో శనివారం సమావేశమైన ఆయన.. ప్రభుత్వ సూచనల మేరకు 400 – 500చ.గజాల్లో ఇంటి నిర్మాణం చేపడితే ఇబ్బందులు ఉండవని తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా ప్రకటించిన గ్రామాల లబ్ధిదారులు తొలుత ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలని, వీరికి ఈనెల 10లోగా తొలి బిల్లు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

పెత్తనం చలాయిస్తే..
పతులకు ఫైన్ !

- స్థానిక సంస్థల్లో మహిళా ప్రజా ప్రతినిధులకు అధికారం అంతంతే..
- 50 శాతం రిజర్వేషన్లు ఉన్నా పురుషుల ఆధిపత్యమే
- అనధికార పెత్తనం తగ్గించేందుకు కేంద్రం చర్యలు
- త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ల స్ఫూర్తిని కాపాడే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అనధికారిక పెత్తనం చలాయిస్తున్న పురుషుల దూకుడుకు కళ్లెం వేయనుంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రం తీసుకోబోయే చర్యలు ఆసక్తికరంగా మారాయి.

మహిళలకు పెద్దపీట..

రాజకీయాల్లో మహిళలను ప్రోత్సహించేందుకు క్షేత్ర స్థాయిలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలను కీలకంగా మార్చారు. 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థల్లో 33 శాతం సీట్లను మహిళలకు రిజర్వ్ చేశారు. తెలంగాణలో అవి 50 శాతానికి చేరుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వార్డు మెంబర్ నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ వరకు, పట్టణాల్లో కౌన్సిలర్ మొదలు మేయర్ వరకు ఆయా సామాజిక వర్గాల వారీగా మహిళలకు సీట్లు కేటాయించారు. దీంతో స్థానిక సంస్థల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగింది. 50 శాతం రిజర్వేషన్‌తో పాటు స్థానిక పరిస్థితులు, బలమైన నాయకత్వం ఉన్న చోట జనరల్ స్థానాల్లోనూ మహిళలే పోటీలో ఉంటున్నారు. ఫలితంగా స్థానిక సంస్థల్లో కొన్ని చోట్ల వారి ప్రాతినిధ్యం 50 శాతం కంటే ఎక్కువగానే ఉంటోంది.

సలహా మండలి సిఫారసులు..

స్థానిక సంస్థల్లో మహిళా ప్రజాప్రతినిధుల కుటుంబానికి చెందిన మగవారి పెత్తనాల అంశం 2023లో సుప్రీంకోర్టులో చర్చకు వచ్చింది. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ల స్ఫూర్తి దెబ్బతింటోందని, దీనిపై దృష్టి సారించాలని కేంద్రానికి సుప్రీం సూచన చేసింది. దీంతో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఈ అంశంపై నివేదిక ఇవ్వాలంటూ సలహా మండలిని ఏర్పాటు చేసింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన సలహా మండలి.. మహిళా రిజర్వేషన్ల అమలు తీరు, మగవారి పెత్తనంపై వివరాలు సేకరించింది. కేంద్రానికి పలు సూచనలు చేస్తూ ఇటీవల నివేదిక సమర్పించింది.

జరిమానాలు విధించేలా..

మహిళా ప్రజాప్రతినిధులు ఎన్నికైన చోట వారి కుటుంబ సభ్యులు పెత్తనం చలాయిస్తే జరిమానా (పెనాల్టీ) విధించాలనే సలహా మండలి సిఫార్సును కేంద్రం సీరియస్‌గా పరిశీలిస్తోంది. ఈ అంశంపై క్షేత్రస్థాయి నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్లు, మహిళా పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయనుంది. అనధికారిక పురుష పెత్తనంపై సహేతుకమైన ఆధారాలతో ఫిర్యాదులు అందించే విజిల్ బ్లోయర్స్ (సామాజిక కార్యకర్తలు)కు నజరానాలు సైతం అందించాలని యోచిస్తోంది. ఈ మేరకు విధివిధానాలు సిద్ధం చేసి త్వరలో అమలు చేసే దిశగా అడుగులు వేస్తోంది.

త్వరలోనే స్థానిక ఎన్నికలు..

జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థల గడువు తీరిపోయింది. ఈ ఏడాది వేసవిలో స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేలా సన్నాహాలు చేస్తోంది. ఎప్పటిలాగే ఈ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆసక్తి గల వారు తమకు రిజర్వేషన్లు అనుకూలించకుంటే తమ కుటుంబంలోని మహిళలను నిలిపేందుకు సిద్ధమవుతున్నారు. అయితే గతంలో మాదిరిగా రాబోయే రోజుల్లో అనధికారిక పెత్తనం చలాయించే అవకాశాలు ఉంచకపోవచ్చనే వాదన వినిపిస్తోంది. కొత్త మార్పులు అమల్లోకి వస్తే రాజకీయ, పాలనా పరమైన అంశాల్లో మహిళలకు మరింత న్యాయం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

పెత్తనం మగాళ్లదే..

స్థానిక సంస్థల్లో 50 శాతం, అంతకు మించి మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నారని చెప్పడానికి ఘనంగానే ఉన్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అలా లేదు. అనేక చోట్ల పెత్తనమంతా ఎన్నికైన మహిళల కుటుంబంలోని మగవారి చేతుల్లోనే ఉంటోంది. ముఖ్యంగా భార్యలు ప్రజాప్రతినిధులుగా ఉన్న చోట భర్తలే అసలైన అధికారం చలాయిస్తున్నారు. మరి కొన్నిచోట్ల కుమారులు, సోదరులు, తండ్రులు కూడా అధికారాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుని మహిళలను నామ్ కే వాస్తే ప్రజాప్రతినిధులుగా మారుస్తున్నారు. ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించడం, ప్రతిపాదనలు రూపొందించడం, ప్రారంభోత్సవాలు తదితర అన్ని పనుల్లో పురుష పెత్తనమే ఎక్కువైంది. అధికారులు సైతం సదరు ప్రజాప్రతినిధుల కుటుంబంలోని మగవారికే అన్ని విషయాలు చెబుతూ పెత్తనానికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. చివరకు అధికారిక సమావేశాలు, గ్రామ/వార్డు సభల్లోనూ తమకు కుర్చీలు ఎందుకు వేయడం లేదనే వరకు ఈ పరిస్థితి రావడం గమనార్హం.

జిల్లాలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే స్థానాలు (అన్నింటా 50 శాతం మహిళలకు రిజర్వేషన్)

వార్డు మెంబర్లు	4,232
సర్పంచ్‌లు	479
ఎంపీటీసీలు	236
జెడ్పీటీసీలు	22
నాలుగు మున్సిపాలిటీల్లో వార్డులు	103

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, హాజరైన అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై ఐడీఓసీలో శనివారం జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు జరుగుతాయని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 73 కేంద్రాల్లో 12, 282 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. పరీక్షలకు 73 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 5 ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఏడుగురు రూట్ అధికారులు, 73 మంది డిపార్టుమెంటల్ అధికారులను నియమిస్తున్నట్లు వివరించారు. పోలీస్ స్టేషన్ నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాల రవాణా, పరీక్ష అనంతరం సమాధాన పత్రాల బండిళ్లను పోస్టాఫీసులకు తరలించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి..

పరీక్ష కేంద్రాల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలు రెండు రోజుల్లో పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్‌ను అమలు చేయాలని అన్నారు. పరీక్షల సమయంలో సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని, విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని ఆయా అధికారులను ఆదేశించారు. ప్రాథమిక చికిత్స కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సమస్య వాటిల్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఈఓ వెంకటేశ్వరాచారి, డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ మహేందర్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి..

భూముల క్రమబద్ధీకరణకు జిల్లాలో దాఖలైన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. మొబైల్ యాప్ ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఇందుకోసం నీటిపారుదల శాఖ అధికారులు ఆయా శాఖల సిబ్బందికి ప్రతీ రోజు లక్ష్యాలను నిర్దేశించాలని, నీటి వనరుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఏల్లో స్థలాలు ఉంటే అనుమతించవద్దని సూచించారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ సమయంలో నిబంధనలు తప్పక పాటించాలన్నారు. అధికారులంతా సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి రెండు వారాల్లో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

అధికారులకు ఐటీడీఏ పీఓ ఆదేశం



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం భోజనం సమకూరుస్తూనే వ్యక్తిగత ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఉద్యోగులకు సూచించారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన పాఠశాలల హెచ్‌ఎంలు, వార్డెన్లు, ఏఎన్‌ఎంలకు భద్రాచలం బీఈడీ కళాశాలలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు అప్రమత్తంగా ఉంటూ పిల్లల ఆరోగ్యాన్ని గమనించాలని, ఎవరైనా అనారోగ్యం బారిన పడితే ప్రత్యేక గది ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేయించాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై సమీప పీహెచ్‌సీల వైద్యులతో నెలకోసారి అవగాహన సదస్సు నిర్వహించాలని సూచించారు. కిశోర బాలికలకు మహిళా వైద్యులతో అవసరమైన కౌన్సెలింగ్ ఇప్పించాలన్నారు. అన్ని పాఠశాలలకు త్వరలోనే మెడికల్ కిట్లు అందిస్తామని పీఓ వెల్లడించారు.

ఎస్సెస్సీలో వంద శాతం ఫలితాలే లక్ష్యం..

పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యాన వెనకబడిన విద్యార్థులకు రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, హెచ్‌ఎంలు, వార్డెన్లు, సబ్జెక్ట్ టీచర్లు పాఠశాలల్లోనే రాత్రి బస చేయాలని పీఓ రాహుల్ ఆదేశించారు. ప్రీ ఫైనల్ పరీక్షల జవాబు పత్రాలు దిద్దే సమయాన విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి మరింత మెరుగుపడేలా సూచనలు చేయాలని తెలిపారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూనే ఆహారం, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, ఏసీఎంఓ రమణయ్య, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ వీరూనాయక్, హెల్త్ కమాండ్ సెంటర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చైతన్య, ఏటీడీఓలు అశోక్ కుమార్, జహీరుద్దీన్, చంద్రమోహన్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంతరపంటలతో అధిక లాభాలు

- ఆయిల్‌పామ్‌లో మునగ సాగు భేష్
- జిల్లా ఉద్యాన అధికారి కిషోర్



మునగ తోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి కిషోర్

అశ్వారావుపేటరూరల్ : ఆయిల్‌పామ్ తోటల్లో అంతర్ పంటగా మునగ సాగు చేసి అధిక లాభాలు గడించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జంగా కిషోర్ సూచించారు. అశ్వారావుపేటలోని కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రం, నర్సరీతోపాటు పాలవ్యంచలో శనివారం ఆయన పర్యటించి రైతులు సాగు చేస్తున్న మునగ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పామాయిల్ తోటల్లో తొలి రెండేళ్ల లోపు అంతర్ పంటగా మునగ సాగు చేస్తే మూడేళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. మునగ పంటతో వచ్చే ఆదాయంతో పాటు తోట యాజమాన్యం నిమిత్తం తమ శాఖ నుంచి ఎకరానికి రూ.2,100 అందిస్తామని చెప్పారు. ఈజీఎస్ జాబ్ కార్డు ఉన్న రైతులకు వంద శాతం సబ్సిడీపై మునగ మొక్కలు పంపిణీ చేస్తామని, మెటీరియల్ కాంపొనెంట్ కింద రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఉద్యాన, ఉపాధి హామీ అధికారులను లేదా ఎంపీడీఓ, ఏఓను సంప్రదించాలని సూచించారు.

ఆశాజనకంగా ఆయిల్‌పామ్ ధర..

ఆయిల్‌పామ్ టన్ను ధర రైతులకు ఆశాజనకంగా మారుతోంది. ధర క్రమంగా పెరుగుతుండగా.. శనివారం ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారుల సమావేశంలో టన్ను ధర మరో రూ.384 పెంచుతూ నిర్ణయించామని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. గత నెల టన్ను ధర రూ.20,487 ఉండగా, తాజా పెంపుతో రూ.20,871కి చేరింది. ఈ సీజన్‌లో అధికంగా ధర పెరగడం ఇదే తొలిసారి. కాగా, ధర పెంపుతో కొత్తగా పామాయిల్ సాగుకు రైతులు ముందుకొచ్చే అవకాశం ఉందని జీఎం చెప్పారు. తోటల సాగుకు కొత్త రైతులు ముందుకొస్తే నాణ్యమైన మొక్కలు అందిస్తామన్నారు.

పందిళ్లపల్లి రైల్వే గూడ్స్‌షెడ్‌కు మోక్షం

కార్మికుల సమస్య పరిష్కారమైతే ఎరువుల దిగుమతి

చింతకాని: చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే స్టేషన్‌లో ఎరువుల దిగుమతి కోసం గూడ్స్ షెడ్ సిద్ధమైంది. దీంతో జిల్లాకు ఎరువుల రవాణా సులువు కానుంది. మూడో రైల్వే లైన్ ఏర్పాటుతో గత జనవరిలో ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఉన్న గూడ్స్ షెడ్‌ను తొలగించి పందిళ్లపల్లి స్టేషన్‌కు మార్చారు. కానీ సాంకేతిక కారణాలతో కొత్త గూడ్స్ షెడ్ ద్వారా ఎరువుల దిగుమతి మొదలుకాకపోవడంతో మిర్యాలగూడ, వరంగల్ రేక్ పాయింట్ల నుండి ఎరువులను తెప్పించి సొసైటీలు, ఆగ్రోస్ కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేశారు. ఈక్రమంలో ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల రైతులకు ఇక్కట్లు ఎదురయ్యాయి. ఇంతలోనే ఇంటిగ్రేటెడ్ ఎరువుల నిర్వహణ వ్యవస్థ(ఐఎఫ్‌ఎంఎస్) ద్వారా పందిళ్లపల్లి షెడ్‌కు రైల్వే వ్యాగన్లలో ఎరువుల సరఫరాకు వివిధ కంపెనీలకు అనుమతి జారీ చేయడంతో సమస్య పరిష్కారమైనట్లయింది.

రంగంలోకి రెండు ప్రాంతాల కార్మికులు

పందిళపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్ నుంచి ఎరువులను సరఫరా చేయడానికి లారీ యజమానుల అసోసియేషన్ బాధ్యులు ముందుకొచ్చి హ్యాండ్లింగ్ కాంట్రాక్టర్‌కు హామీ ఇవ్వడంతో ఆ సమస్య తీరింది. ఇదిలా ఉండగా పందిళ్లపల్లి గూడ్స్ షెడ్‌లో పనిచేసేందుకు పరిసర ప్రాంతాల కార్మికులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇక్కడ ఎగుమతి, దిగుమతులను తక్కువ ధరకే చేస్తామని కాంట్రాక్టర్‌కు హామీ పత్రం అందజేశారు. ఇంతలోనే ఖమ్మం గూడ్స్ షెడ్‌లో పనిచేసిన కార్మికులు సైతం తామే ఇక్కడ పనిచేస్తామని, కొత్తవారిని తీసుకోవద్దని కోరారు. ఈఅంశం రాజకీయ నాయకుల జోక్యంతో తీవ్రం కాగా వైరా పోలీస్ సర్కిల్ కార్యాలయానికి చేరింది. అధికారులు సమస్యను పరిష్కరిస్తే త్వరలోనే వ్యాగన్ల ద్వారా ఎరువుల దిగుమతి మొదలుకానుంది.

స్కూల్ స్కీముల్లో స్కామ్‌లు !

- బాలికల ఆత్మరక్షణ శిక్షణపై ప్రచారం శూన్యం
- గుట్టుగా నిధులు స్వాహా చేస్తున్న వైనం
- ఇన్‌స్ట్రక్టర్లుగా అనర్హుల నియామకం
- వాటాలు పంచుకుంటున్న హెచ్‌ఎంలు, శిక్షకులు
- ఏసీబీకి పట్టుబడడంతో విషయం వెలుగులోకి..



కొత్తగూడెంఅర్బన్: బాలికలు, యువతులు, మహిళలపై దాడులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచడంతో పాటు దాడుల నుంచి స్వీయ రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు చేపడుతున్నాయి. బాల్యం నుంచే వారు ధైర్యంతో ముందుకుసాగితే భవిష్యత్‌లో ఎలాంటి ఘటనలు ఎదురైనా ఇబ్బంది ఉండదనే ఉద్దేశంతో బాలికలకు విద్యార్థి దశలోనే కరాటేలో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో అవి కాగితాలకే పరిమితమవుతుండగా.. బాలికలు శిక్షణకు నోచుకోవడం లేదు. పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ప్రభుత్వం తగిన వేతనం ఇస్తున్నా.. కొందరు మాత్రం అదనపు డబ్బుల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు.

బాలికల ఆత్మరక్షణకు..

ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు చదివే బాలికలకు కరాటేలో శిక్షణ ఇచ్చేందుకు 2018లో ప్రభుత్వం రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షా ప్రశిక్షణ పేరుతో ఓ పథకాన్ని ప్రారంభించగా, నాలుగేళ్ల క్రితం పీఎం శ్రీ కింద మరో స్కీమ్ ఏర్పాటు చేశారు. అయితే జిల్లాలో ఈ రెండు పథకాలపై ప్రచారం చేయడం, బాలికలకు శిక్షణ ఇప్పించడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాలికలకు మూడు నెలల పాటు శిక్షణా తరగతులు నిర్వహించాల్సి ఉండగా విద్యాశాఖ అధికారులు ఒక్క రోజు కూడా తనిఖీ చేసిన దాఖలాలు లేవు. దీంతో కరాటే శిక్షణకు విడుదలవుతున్న నిధులు భారీగా దుర్వినియోగం అవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


శిక్షణ ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు మూడు నెలల పాటు కరాటే శిక్షణ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ సంవత్సరం నిధులు విడుదల చేస్తున్నాయి. ఈ మేరకు ఇన్‌స్ట్రక్టర్లను నియమించి జనవరి నుంచి ఏప్రిల్ వరకు శిక్షణ పూర్తి చేయాల్సి ఉంటుంది. విద్యార్థినులకు రోజు వారీ బోధనతో పాటు ఈ మూడు నెలలు అదనంగా మరి కొంత సమయం కేటాయించి శిక్షణ ఇప్పించాలి. అయితే సమయం సరిపోవడం లేదనే సాకుతో బాలికలకు శిక్షణ ఇప్పించడం లేదని, నిధులు మాత్రం హెచ్‌ఎంలు, ఇన్‌స్ట్రక్టర్లు వాటాలుగా పంచుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా శుక్రవారం కొత్తగూడెం కూలీలైన్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంకు, ఇన్‌స్ట్రక్టర్‌కు మధ్య విభేధాలు రావడం, ప్రధానోపాధ్యాయుడిపై శిక్షకుడు ఏసీబీకి ఫిర్యాదు చేసి పట్టించిన విషయం తెలిసిందే. అయితే మిగతా పాఠశాలల్లోనూ ఇదే తంతు సాగుతున్నా గుట్టుచప్పుడు కాకుండా పంపకాలు జరుగుతున్నాయని సమాచారం. ఇక పాఠశాలల్లో శిక్షకులను జిల్లా క్రీడా శాఖాధికారి ఎంపిక చేయాల్సి ఉండగా, జిల్లా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇందులోనూ అనర్హులకు స్థానం కల్పించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎంపికైన పాఠశాలలు ఇవే..

బాలికలకు కరాటేలో శిక్షణ ఇప్పించేందుకు జిల్లాలో రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షా ప్రశిక్షణ పథకం కింద 183 పాఠశాలలు, పీఎంశ్రీ పథకం కింద 17 పాఠశాలలను ఎంపిక చేసి నిధులు మంజూరు చేస్తున్నారు. అన్ని పాఠశాలల్లోనూ ఇన్‌స్ట్రక్టర్లకు ఇప్పటికే సగం వరకు డబ్బులు ముట్టాయి. ఒక్కో పాఠశాలలో శిక్షణ పొందే విద్యార్థినులు 50 మందికి పైగా ఉంటే నెలకు రూ.10 వేలు, 50 మందికి తక్కువగా ఉంటే రూ.5వేల చొప్పున మూడు నెలల పాటు విడుదల చేస్తారు. పీఎంశ్రీ కింద జిల్లాలోని 16 పాఠశాలలకు నెలకు రూ.10 వేలు, ఒక పాఠశాలకు రూ.5 వేల చొప్పున విడుదలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అందించే రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్ష పథకం కింద కూడా 183 పాఠశాలలకు అలాగే నిధులు విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్ర విద్యాశాఖ నుంచి ప్రొసీడింగ్స్ ఆలస్యంగా రావడంతో ఫిబ్రవరిలోనే కరాటే క్లాసులు ప్రారంభమైనట్లు పాఠశాలల హెచ్‌ఎంలు నమోదు చేసుకున్నారు. అయితే శిక్షణ అన్ని పాఠశాలల్లో కూడా కాగితాలకే పరిమితమైందని, బాలికలకు కరాటే నేర్పించడం లేదని తెలుస్తోంది.

శిక్షణ అందించని పాఠశాలలపై చర్యలు..



జిల్లాలోని ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో కరాటే శిక్షణ ఇప్పిస్తున్నాం. శిక్షణ ఇవ్వని పాఠశాలలపై ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేసిన పాఠశాలల్లో తప్పని సరిగా కరాటే శిక్షణ తరగతులు నిర్వహించేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలి.

– వెంకటేశ్వరా చారి, డీఈఓ

క్లుప్తంగా

రామాలయానికి మాజీ సర్పంచ్ రూ.5లక్షల విరాళం

అశ్వాపురం: మండలంలోని మొండికుంటలో నిర్మాణం పూర్తయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు సిద్ధమైన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగానే మాజీ సర్పంచ్, ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ మర్రి మల్లారెడ్డి –సంధ్యారాణి దంపతులు శనివారం రూ.5 లక్షల విరాళం అందజేశారు. మొండికుంట గ్రామస్తుల చిరకాల కోరిక అయిన రామాలయ నిర్మాణాన్ని పూర్తిచేయడంలో చొరవ చూపడమే కాక విరాళం అందించిన మల్లారెడ్డికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగం పేరుతో మోసం

పాల్వంచ: ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని నవభారత్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని కేటీపీఎస్ కాలనీకి చెందిన పోటు స్వాతి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన పోలంపల్లి రాజశేఖర్ రూ.3.30 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు తిరిగి ఇవ్వలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో 9 మందికి గాయాలు


తీవ్రంగా గాయపడిన సంధ్య, నాగమణి

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది మిర్చి కూలీలు గాయపడ్డారు. సుదిమళ్ల గ్రామానికి చెందిన కూలీలు రొంపేడు గ్రామంలో మిర్చి కోసేందుకు ఆటోలో వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో వాహనం అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో ఈ ఆటోలో ప్రయాణిస్తున్న వారందరూ గాయపడ్డారు. గ్రామస్తులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడ్డవారిలో సంధ్య, నాగమణి, లక్ష్మి, వీరమ్మ, నర్సమ్మ, రాజేశ్వరి, లావణ్య, కనకమ్మ, గురువమ్మ ఉన్నారు. వీరిలో సంధ్య, నాగమణి, లక్ష్మిలకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు ఖమ్మం సిఫారసు చేశారు.

మూడు ఆటోలు సీజ్

చంద్రుగొండ : పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న మూడు ఆటోలను శనివారం సీజ్ చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. చంద్రుగొండ నుంచి అన్నపురెడ్డిపల్లి వైపు వెళ్తున్న ఆటోలను తనిఖీ చేయగా ఒక్కో ఆటోలో 14 మంది ప్రయాణికులు ఉన్నారని ఎస్ఐ పేర్కొన్నారు. ఆటోల యజమానులపై కేసు నమోదు చేశామన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య


అగ్గిరాములు (ఫైల్)

చింతకాని: మండలంలోని చిన్నమండవకు చెందిన తుపాకుల అగ్గిరాములు(43) అప్పుల బాధతో శుక్రవారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన గత నాలుగేళ్లుగా కుటుంబ అవసరాలకు అప్పులు చేయగా అవి పెరగడంతో తీర్చే మార్గం లేక మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి భార్యాపిల్లలు నిద్రించాక ఇంటి వరండాలోని రేకుల షెడ్ పైప్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. తెల్లవారుజామున నిద్రలేచిన భార్య ఈ విషయాన్ని గమనించి స్థానికులను పిలవగా పరిశీలించే సరికి అగ్గిరాములు మృతి చెందాడు. ఘటనపై ఆయన భార్య ప్రభావతి శనివారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

రోడ్డు రోలర్ చోరీపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రోడ్డు రోలర్ చోరీ జరిగిందని ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురానికి చెందిన భిక్షంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. ఏదులాపురానికి చెందిన భిక్షంరెడ్డి వద్ద రోడ్డు రోలర్ అద్దెకు తీసుకునేందుకు ఫిబ్రవరి 23న ముగ్గురు సంప్రదించారు. రూ.35 వేల అద్దెతో ఒప్పందం కుదరగా రూ.25వేలు పంపించారు. దీంతో ఆయన అదేరోజున వాహనాన్ని డ్రైవర్ అఫ్జల్‌తో మహబూబాబాద్ పంపించాడు. అయితే, ఆర్‌టీబీ ప్రాంతంలో డ్రైవర్ వాహనాన్ని నిలపగా మరుసటి రోజు ఉదయంకల్లా కనిపించలేదు. ఈమేరకు ఫిబ్రవరి 25న మహబూబాబాద్ చేరుకున్న భిక్షంరెడ్డికి పాత ఇనుప సామాన్ల దుకాణం సమీపాన రోడ్డు రోలర్ కనిపించడంతో ఆరా తీయగా రూ.2.19 లక్షలకు ఓ వ్యక్తి విక్రయించాడని షాపు నిర్వాహకులు తెలిపారు. దీంతో ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

పవిత్రమాసం.. రంజాన్



- నేటి నుంచి ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం
- ఉపవాస దీక్షలు చేపట్టనున్న ముస్లింలు

పవిత్రతకు ప్రతిరూపమైన రంజాన్ మాసం నేటి(ఆదివారం) నుంచి ప్రారంభం కానుంది. చంద్రవంక కనిపించడంతో శనివారం రాత్రి ప్రత్యేక ప్రార్థన(తరాబీ)లు, నమాజ్‌లతో ముస్లింలు రంజాన్ మాసానికి స్వాగతం పలికారు. ప్రపంచ మానవాళికి మార్గదర్శకత్వం చూపే దివ్యఖురాన్ ఈ మాసంలోనే అవతరించిందని నమ్ముతారు. ఈ మాసంలో ప్రతి విశ్వాసి రోజా (ఉపవాసం) ఆచరిస్తారు. ఉపవాసం ముస్లింల విధిగా నిర్ణయించినట్లు దైవ గ్రంథాలు చెబుతున్నాయి.

– చంద్రుగొండ

ఉపవాసంతో ప్రయోజనాలు

ఉపవాసం ద్వారా మానసికంగా, శారీరకంగా, నైతికంగా, సామాజిక ప్రయోజనాలు కలుగుతాయి. సూర్యోదయం కంటే ముందు నుంచే సూర్యాస్తమయం వరకు దాదాపు 13 నుంచి 14 గంటలపాటు ధర్మసమ్మతమైన ఆహార పానీయాలను సైతం తీసుకోరు. యంత్రాలను సైతం కొంత సమయం తర్వాత ఎలా నిలుపుదల చేస్తామో ఆ విధంగా ఓ మనిషి పగటి వేళ ఆహార పానీయాలు తీసుకోకపోవడం వల్ల జీర్ణకోశం బలోపేతం అవుతుంది. ఉదరకోశానికి విశ్రాంతి నివ్వడం ద్వారా శరీరానికి అనారోగ్యం కలిగించే ఆమ్లాలు హరించుకుపోతాయి. జీర్ణశక్తి, రోగ నిరోధక శక్తి పెరుగుతాయి. ఇదే అంశంపై సంస్కృతంలో సంకణం – దివ్య ఔషధం ఇదే విషయాన్ని ఆయుర్వేదశాస్త్రం కూడా బలపరుస్తుంది.


నైతికత పెంపొందేలా..

మనసా వాచా కర్మేణా ఓ వ్యక్తి ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నపానీయాలను దూరంగా ఉంటూ చెడులకు, వ్యసనాలను సైతం అదుపులో ఉంచుకోవడమే నైతికత. తనకు తాను అదుపులో ఉంచుకుని రంజాన్ నెల మొత్తం ఉపవాసాలు ఉండే వ్యక్తికి ఈ నెల రాబోవు 11 నెలలకు శిక్షణ లాంటిది. ఆకలిదప్పుల బాధ తెలవడంతోపాటు పేదలకు ఆదుకునే తత్వం పెంపొందుతుంది. రంజాన్ నెలలో రూపాయి దానం చేస్తే అందుకు ఏడు వందల రెట్లు పుణ్యఫలం దక్కుతుందని పలువురు విశ్వసిస్తారు. ప్రతి మనిషిలో దానధర్మ గుణాలను ప్రోత్సహించడమే ఈ మాసపు లక్ష్యంగా చెప్పవచ్చు.

చాంద్ ముబారక్

- కనిపించిన నెలవంక

అశ్వారావుపేటరూరల్: ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభంకానుంది. శనివారం సాయంత్రం ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో ముస్లింలంతా చాంద్ ముబారక్ అంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదులు, ఇళ్ల వద్ద ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.


అశ్వారావుపేటలో కనిపిస్తున్న నెలవంక

ఆకలి బాధ తెలిసేందుకే..



రంజాన్‌లో ఆచరించే రోజా(ఉపవాసం) అంటే కేవలం పస్తులుండటం కాదు. కనీసం ఒక్కపూట కూడా తిండి లేనివారు, ఒళ్లు దాచుకోవడానికి కూడా దుస్తులులేనివారి దుర్భర జీవనం పరిస్థితిని అవగతం చేసుకోవడమే ఉపవాసం ఉద్దేశం.

– ఎం.డీ.ఉస్మాన్‌ఖాన్, ఆధ్యాత్మిక రచయిత, ములకలపల్లి

స్వీయ నియంత్రణ



ఉపవాసం (రోజా) పాటించడంతో మనిషి చెడుల నుంచి నియంత్రణలోకి వస్తాడు. పేదలు పడే ఇబ్బందులు తెలుస్తాయి. ఫలితంగా తనకుతానుగా మంచిమార్గంలో ప్రయాణం చేసేందుకు ఉపవాసం ఉపయోగ పడుతుంది.

– అబ్దుల్ రెహమాన్, మదర్సా ఇస్లామియా దారుల్ ఉలూం, కొత్తగూడెం

సద్భావన జనిస్తుంది



ఉపవాసవ్రతం పాటిస్తే ఆకలి అంటే ఏమిటో స్వయంగా అనుభవంలోకి వస్తుంది. తద్వారా మనిషిలో పరుల పట్ల సానుభూతిభావాలు పెంపొందుతాయి. పేదలకు దానధర్మాలు చేయాలన్న సద్భావన జనిస్తుంది.

– యాకూబ్‌పాషా, జిల్లా మైనారిటీ ప్రెసిడెంట్, పాల్వంచ

వ్యసనాలు దూరం



ఉపవాసదీక్షతో మనిషిలో చెడువ్యసనాలు దూరమవుతాయి. మంచి మార్గంలో జీవనం సాగించడంతోపాటు తోటివారి పట్ల ప్రేమ ఆప్యాయతలు పెంపొందుతాయి. ఫలితంగా మంచి సమాజ ఆవిష్కరణకు దోహదపడుతుంది.

– ఎం.డీ.ఖాజాహుస్సేన్, సనాతన ధర్మ సత్యసందేశ కేంద్రం, చంద్రుగొండ

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు
- రెండు వారాల్లో ఆరు వాహనాలు సీజ్

ములకలపల్లి: ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మండలంలోని వివిధ వాగుల నుంచి ఆరు నెలలుగా ఇసుక తరలిపోతోంది. రాత్రివేళ పదుల సంఖ్యలో లారీల్లో, ట్రాక్టర్లలో రవాణా చేస్తున్నారు. ఉమ్మడి పూసుగూడెం పంచాయతీ పరిధి సీతారాంపురం శివారు గుర్రాలకుంట బస్‌షెల్టర్ సమీపంలోని వాగుల నుంచి ఏకలవ్య పాఠశాల, సీతారామ కాంట్రాక్ట్ పనులకు, సత్తుపల్లి, పెనుబల్లి, ఖమ్మం, కొత్తగూడెం తదితర పట్టణాలకు తరలిస్తున్నారు. పోలీస్, రెవెన్యూ శాఖల సహకారంతోనే ఈ దందా సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే కొద్దిరోజులుగా పోలీసులు ఇసుక తరలింపుపై నిఘా పెట్టారు. రెండు వారాల వ్యవధిలో మూడు లారీలు, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి, కేసులు నమోదు చేశారు. కాగా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని, ప్రత్యేక నిఘా పెట్టామని ములకలపల్లి ఎస్ఐ కిన్నెర రాజశేఖర్ తెలిపారు.


పోలీసులు సీజ్ చేసిన ఇసుక లారీలు

ఇసుక ట్రాక్టర్ సీజ్

బూర్గంపాడు: కిన్నెరసాని నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు సీజ్ చేశారు. బుడ్డగూడెం గ్రామ సమీపం నుంచి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చంద్రుగొండలో..

చంద్రుగొండ : మండలంలోని సత్యనారాయణపురం గ్రామ శివారులో ఉన్న ఎదుళ్లవాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం రాత్రి సీజ్ చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. ట్రాక్టర్ యజమాని నర్సింహారావుపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

మూడు బియ్యం లారీలు సీజ్

కాకినాడ పోర్ట్‌కు తరలిస్తుండగా అడ్డుకున్న అధికారులు

అశ్వారావుపేటరూరల్: అనుమతి లేకుండా రాష్ట్ర సరిహద్దు, ఆపై దేశం దాటించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తుండగా.. మూడు బియ్యం లారీలను అశ్వారావుపేట ఆర్‌టీఏ చెక్‌పోస్టు వద్ద అధికారులు శనివారం అడ్డుకున్నారు. రాష్ట్రంలోని కరీంనగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల నుంచి ఏపీలోని కాకినాడ పోర్ట్‌కు 12బియ్యం లారీలు బయలుదేరాయి. అనుమానంతో అసిస్టెంట్ సివిల్ సప్లయీస్ అధికారి వరదరాజులు, డీటీ ప్రభాకర్ ఆధ్వర్యాన తనిఖీ చేశారు. అయితే, తొమ్మిది లారీలకు అనుమతి ఉండగా, మరో మూడింటికి అనుమతులు లేవని గుర్తించి అడ్డుకున్నారు. పట్టుబడిన ఒక్కో లారీలో 200 క్వింటాళ్ల బాయిల్డ్ రైస్ ఉందని, ఈ లారీలను సీజ్ చేసి బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే, తనిఖీల విషయాన్ని, ఎన్ని లారీలను సీజ్ చేశారనే అంశాన్ని బహిర్గతం చేయకుండా గంటల కొద్ది రహస్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


సీజ్ చేసిన బియ్యం లారీల వద్ద అధికారులు

దండకారణ్యంలో శాంతి నెలకొల్పుతాం

సీఆర్‌పీఎఫ్ ఐజీ రాకేష్ అగర్వాల్

చర్ల: దండకారణ్యంలోని గ్రామాల్లో శాంతిని నెలకొల్పేందుకు పోలీసు యంత్రాంగం కృషి చేస్తోందని సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్ ఛత్తీస్‌గఢ్ సెక్టార్ ఐజీ రాకేష్ అగర్వాల్ పేర్కొన్నారు. మండల సరిహద్దున ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధి కొరగట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఆర్‌పీఎఫ్ క్యాంపులో ఆదివారం సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. సమీప కంచాల, బట్టిగూడెం, దామవరం, జీడిపల్లి, గాదిగూడెం, మీనగట్ట తదితర గ్రామాలకు చెందిన సుమారు 200 మంది ఆదివాసీలకు నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు, వ్యవసాయ సామగ్రి, క్రీడా సామగ్రి, విద్యార్థులకు యూనిఫాం, స్టేషనరీ, సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లో అసాంఘిక శక్తుల వల్ల నెలకొన్న భయాందోళనలను పోగొట్టి శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పోలీస్‌శాఖ కృషి చేస్తోందని తెలిపారు. సీఆర్పీఎఫ్ డీఐజీ ఎన్‌కే సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్‌కుమార్, కమాండెంట్ రంజన్ ప్రకాశ్, డిప్యూటీ కమాండెంట్ లీలామోహన్ కుమార్, అసిస్టెంట్ కమాండెంట్ డాక్టర్ నీరజ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.


ఆదివాసీలకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు

కబడ్డీ టోర్నీ విజేత విజయవాడ

ఎర్రుపాలెం: మహాశివరాత్రి పండుగ సందర్భంగా మండలంలోని బనిగండ్లపాడు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి, ఈ పోటీల్లో విజేతగా ఏపీలోని విజయవాడ సాయి సెంటర్ జట్టు నిలిచి రూ.25వేలు, ఖమ్మం అకాడమీ జట్టు రెండో స్థానంలో నిలిచి రూ.20వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి. అలాగే, మూడు నుంచి ఆరో స్థానం వరకు బనిగండ్లపాడుకు చెందిన పెద్దమళ్ల వెంకటేశ్వర్లు మెమోరియల్ జట్టు, వై.కే.రెడ్డి రాజుల దేవరపాడు, బనిగండ్లపాడు జీవీకే ఈవెంట్స్, బనిగండ్లపాడు గణేష్ మార్కెట్ జట్లు నిలవగా నగదు బహుమతులు అందజేశారు. మధిర మార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, శివాలయం వ్యవస్థాపకులు ఐలూరి అంకిరెడ్డి –విజయలక్ష్మితో పాటు యరమల పూర్ణచంద్రారెడ్డి, గుర్రాల శ్రీనివాస్‌రెడ్డి, యన్నం పిచ్చిరెడ్డి, పెద్దమళ్ల మోహన్‌రావు విజేతలకు బహుమతులు అందజేయగా అర్చకులు కాశవఝల నర్సింహమూర్తితో పాటు ,అనుమోలు కృష్ణారావు, యన్నం సత్యనారాయణరెడ్డి, శీలం ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్లకు బహుమతులు అందచేస్తున్న నిర్వాహకులు

అనుచరుడి పాడె మోసిన మంత్రి తుమ్మల


సత్యం పాడె మోస్తున్న మంత్రి తుమ్మల, తదితరులు

సత్తుపల్లి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అనుచరుడు, మాజీ జెడ్పీటీసీ గాదె సత్యనారాయణ(79) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందగా శనివారం సత్తుపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించే సమయాన మంత్రి కన్నీటి పర్యంతమయ్యారు. ఆ తర్వాత అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, కూసంపూడి మహేష్, దొడ్డా శంకర్‌రావు, సాంబశివరావు ఉన్నారు.

బాలుడు సహా ముగ్గురిపై పోక్సో కేసు

అశ్వారావుపేటరూరల్: ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న బాలుడితోపాటు అతనికి సహకరించిన మరో ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.యయాతి రాజు తెలిపారు. అశ్వారావుపేటకు చెందిన బాలుడు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను కొద్ది రోజులుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి మరో ఇద్దరు యువకులు సహకరిస్తున్నారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

శివరాత్రి జాతరల ఆదాయం లెక్కింపు

మృత్యుంజయ స్వామి ఆలయానికి రూ.32.78లక్షలు

మధిర: మధిరలోని మృత్యుంజయ స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా జరిగిన జాతరకు సంబంధించి ఆదాయాన్ని శనివారం లెక్కించారు. ఈ సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3.80 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ జగన్మోహన్రావు వెల్లడించారు. అలాగే, జాయింట్ వీల్, దుకాణాల ఏర్పాటు, కొబ్బరిచిప్పల సేకరణ, ప్రసాదాల అమ్మకం, కల్యాణ కట్నాలు, పూజల టికెట్ల అమ్మకంతో కలిపి రూ.32.78 లక్షల ఆదాయం నమోదైందని పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే రూ.3.52 లక్షల ఆదాయం పెరిగిందని ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాధ, అర్చకులు రాయప్రోలు సత్యనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

స్నానాల లక్ష్మీపురంలో రూ.9.47లక్షలు

వైరారూరల్: వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. హుండీ ఆదాయం రూ.3,55,450 సమకూరగా, టికెట్ల అమ్మకంతో రూ.2,99,840, దుకాణాల వేలం ద్వారా రూ. 83,350, మిఠాయి షాపుల ద్వారా రూ.50వేలు, ప్రసాదాల అమ్మకంపై రూ.1,39,500, కొబ్బరిచిప్పల వేలంతో రూ.19వేలతో పాటు కల్యాణ కట్న కానుకలు కలిపి రూ.9,47,564 ఆదాయం సమకూరిందని అధికారులు వెల్లడించారు. ఈకార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి కె.వేణుగోపాలచార్యులు, ఈఓ హరిశ్చంద శేఖర్, ఉత్సవ కమిటీ చైర్మన్ దొడ్డా ఉషారాణితో పాటు దొడ్డా పుల్లయ్య, మల్లు రామకృష్ణ, నూతి వెంకటేశ్వర్లు, మొగునూరు సత్యనారాయణ, మల్లు శేషమ్మ, సుల్తాన్ పద్మా, తలారి నర్సింహారావు, సంగేపు రామకృష్ణ, గిరగాని శ్రీనివాసరావు, మైబ్‌జానీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వైరా రూరల్ : ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు

కోటిలింగాల జాతరకు రూ.3.54లక్షలు

కారేపల్లి: మహా శివరాత్రి సందర్భంగా కారేపల్లి మండలం బుగ్గవాగు ఒడ్డున శ్రీ కోటిలింగాల ఆలయంలో నిర్వహించిన జాతర ఆదాయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ అలెం వెంకటేశ్వర్లు శనివారం ప్రకటించారు. హుండీలో భక్తులు రూ.92,825 సమర్పించగా, కొబ్బరికాయల షాపు వేలం ద్వారా రూ.90వేలు, కొబ్బరిచిప్పల వేలంతో రూ.22వేలు, లడ్డూల అమ్మకం ద్వారా రూ.20వేలు, దర్శన టికెట్ల ద్వారా రూ.1,29,430 కలిపి రూ.3,54,255 ఆదాయం వచ్చిందని తెలిపారు. అయితే, జాతర ఏర్పాట్లకు రూ.3,82,082 ఖర్చు కావడంతో రూ.27,827 లోటు నమోదైందని వెల్లడించారు. గత ఏడాది రూ.50వేలు మిగలగా, ఈసారి భక్తుల సంఖ్య తగ్గటంతో ఆదాయం సైతం తగ్గిందని భావిస్తున్నారు.

సీతారామ కాలువలో పడి వ్యక్తి మృతి


వెంకటేష్ (ఫైల్)

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన తాళ్లూర వెంకటేష్ (30) గుంపెన సమీపంలోని సీతారామ కాలువలో పడి శనివారం మృతి చెందాడు. వెంకటేష్ స్నేహితులతో కలిసి సరదాగా చేపలు పట్టేందుకు సీతారామ కాలువ వద్దకు వెళ్లాడు. వల విసిరే క్రమంలో కాలు జారి కాలువలో పడిపోయాడు. స్నేహితులు వెలికితీసి ఎర్రగుంట పీహెచ్‌సీ తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు..

చంద్రుగొండ : మండలంలోని మంగయ్యబంజర్ గ్రామానికి చెందిన నక్కా మనోహర్ (22) శనివారం తెల్లవారుజామున అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రాత్రి ఇంట్లో నిద్రించిన యువకుడు ఉదయం లేచేసరికి జామచెట్టుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకులు తెలిపారు. తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్...

పాల్వంచ: విద్యుదాఘాతంతో శనివారం ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని శ్రీనివాస కాలనీకి చెందిన నిమ్మల ప్రసాద్ (32) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ముర్రేడువాగు సమీపంలో రైతు పరిమి వెంకన్న పొలంలో మోటర్ రిపేర్ చేసేందుకు వెళ్లాడు. రిపేర్ చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య భానుశ్రీ, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు ...

పాల్వంచరూరల్: పురుగుల మందుతాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు శనివారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని రంగాపురం గ్రామానికి చెందిన, వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మాలోత్ సీతారాములు(69) శుక్రవారం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందుతాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉండగా, పక్క పొలం రైతు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పాల్వంచ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడని, తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఇరుకు దారిలో ప్రమాదం, స్తంభించిన ట్రాఫిక్

ఖమ్మంరూరల్: మండలంలోని జలగంగనర్ వద్ద శనివారం కారును లారీ ఢీకొట్టగా ఇరుకుదారి కావడంతో గంటల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. హైదరాబాద్ వైపు నుండి ఖమ్మం వస్తున్న కారును ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టి రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. కాగా, మున్నేరు వద్ద తీగల వంతెన నిర్మాణ పనులు జరుగుతుండగా, మూడు నెలల క్రితం మున్నేటి పాత బ్రిడ్జిపై నుండి సైతం రాకపోకలు నిలిపేశారు. దీంతో ప్రత్యామ్నాయంగా మున్నేటి బిడ్జి కింది నుండి తాత్కాలికంగా సింగిల్ రోడ్డు వేయగా ఈ రహదారిపై ప్రమాదం జరగడంతో రెండు వైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు చేరుకుని లారీని పక్కకు తీయించి, ఖమ్మం నుండి జలగంగనర్ వైపు వచ్చే వాహనాలను ఎంపీడీఓ కార్యాలయం పక్క నుండి మళ్లించారు. దీంతో రెండు గంటల పాటు వాహనదారులు ఇబ్బంది పడ్డారు.


రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

మహిళా హోంగార్డుపై వరకట్న వేధింపులు

పాల్వంచరూరల్: మహిళా హోంగార్డును వరకట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్త, మామలపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన దుర్గ బూర్గంపాడు పోలీసుస్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తోంది. ఆమె నాలుగున్నరేళ్ల క్రితం పినపాక మండలం టి.కొత్తగూడెం గ్రామానికి చెందిన గంపల ప్రసాద్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఏడాది పాప ఉంది. ఇటీవల కొంత కాలంగా అదనపు కట్నం కోసం భర్త, అత్త, మామలు వేధిస్తున్నారని దుర్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో భర్త ప్రసాద్, అత్త రమణ, మామ సత్యంలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.